# ఊరెళ్తున్నారా.. తస్మాత్ జాగ్రత్త

- దొంగలకు తాళం వేసిన ఇండ్లే టార్గెట్
- చోరీలకు అనుకూలంగా వాతావరణ ప్రతికూల పరిస్థితులు
- ఊరెళ్లే వారికి పోలీసుల సూచనలు
- అదమరిస్తే అంతే సంగతులు.. అప్రమత్తతే ముఖ్యం

బొల్లారం మున్సిపాలిటీ ముఖచిత్రం

జిన్నారం (బొల్లారం) జనవరి 13 : సంక్రాంతి సెలవులు వచ్చాయి.. సెలవుల్లో సరదాగా ఎక్కువ మంది సొంత ఊర్లకు ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో పరిశ్రమల్లో పనిచేసే తెలుగు వారు పెద్ద ఎత్తున ఊర్లకు వెళ్లేవారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని బొల్లారం పోలీసులు పేర్కొంటున్నారు. ఇంటికి తాళం వేసి ఊర్లకు వెళ్లేవారు తమకు సమాచారం ఇవ్వాలని సీఐ రవీందర్ రెడ్డి సూచించారు. సెలవుల్లో ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే క్రమంలో దొంగలు రెచ్చిపోయే అవకాశం ఉందన్నారు.

### దొంగలకు అనుకూలిస్తున్న కాలం..

ప్రస్తుతం వాతావరణం కూడా దొంగలకు అనుకూలిస్తోంది. రాత్రి వేళల్లో మంచు తీవ్రంగా కురుస్తుండడంతో రాత్రి 9 గంటల తర్వాత వీధులన్నీ నిర్మానుష్యంగా ఉంటున్నాయి. పారిశ్రామికవాడలో సీసీ కెమెరాలు అలంకారప్రాయంగానే ఉంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల మధ్య దొంగలు మరింత రెచ్చిపోయే అవకాశం ఉన్నది.

### ప్రజలకు పోలీసుల సూచనలు ఇవి..

ఊరు వెళ్లేటప్పుడు ఖరీదైన వస్తువులు, డబ్బు ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్‌లో పెట్టుకోవాలి.

- ఊరెళ్లే విషయాన్ని సోషల్ మీడియాలో ఎక్కడ పోస్ట్ చేయొద్దు.
- ఇంటి డోర్స్‌కు సెంట్రల్ లాకింగ్ సిస్టం వాడాలి.
- తాళం వేసి ఊరికి వెళ్లే ముందు పోలీస్ స్టేషన్లో తప్పక సమాచారం ఇవ్వాలి.
- ఇంటికి సీసీ కెమెరాలు ఉన్నవారు ఆన్‌లైన్‌లో చెకింగ్ చేసుకోవాలి.
- అపరిచిత వ్యక్తులు వస్తే వారి సమాచారాన్ని పోలీసులకు తెలపాలి.
- శివారు ప్రాంతాల్లో ఎవరైనా కొత్తవారు సంచరిస్తే వారి గురించి సమాచారం పోలీసులకు ఇవ్వమని చెప్పాలి.
- ఊరెళ్లే ముందు ఇరుగుపొరుగు వారిని ఇంటిని కనిపెట్టమని ఓ మాట చెప్పి వెళ్లాలి.
- పక్కింటి వారి నుంచి ఎప్పటికప్పుడు ఇంటి జాగ్రత్తలపై సమాచారం తెలుసుకుంటూ ఉండాలి.
- ఎవరైనా అనుమానితులుగా అనిపిస్తే.. పోలీస్ స్టేషన్ నంబర్ 8712661841, 8712656729లో వెంటనే సమాచారం అందించాలి.

### నిఘా పెంచుతున్నాం..

సంక్రాంతి పండుగ సెలవుల్లో దొంగతనాలు జరగకుండా నిఘా పెంచుతున్నాం. పారిశ్రామిక వాడలో పెట్రోలింగ్, గస్తీ పెంచాం. ఇళ్లకు తాళం వేసి వెళ్లే ప్రజలు పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలి. దీంతో అక్కడ నిఘా పెంచే అవకాశం ఉంటుంది. దొంగతనాల నేపథ్యంలో ప్రతి ఒక్కరిని అప్రమత్తం చేస్తున్నాం.

-రవీందర్ రెడ్డి (సీఐ బొల్లారం)

# జర భద్రం..!

- విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లతో జాగ్రత్త
- రోడ్లపై గాలిపటాల కోసం పరుగులు తీయొద్దు
- చెట్లు, భవనాలపై నుంచి ఎగిరేస్తే ప్రమాదం
- చైనా మాంజాతో పక్షులు, మనుషులకు పొంచి ఉన్న ప్రమాదం
- పిల్లలు, యువకుల పట్ల తల్లిదండ్రులు బహుపరాక్

పతంగులు ఎగరేసేటప్పుడు నిర్లక్ష్యం వద్దు..!

జహీరాబాద్ పట్టణంలోని ఇంటి మేడపై పతంగులను ఎగురవేస్తున్న యువకులు, పిల్లలు

జహీరాబాద్, జనవరి 13 : సంక్రాంతి పండుగ అంటే రంగురంగుల ముగ్గులేనా.. హరిదాసు కీర్తనలేనా.. డూడూ బసవన్న లేనా.. గొబ్బెమ్మలేనా..? కాదు.. అంతకు మించి.. సంక్రాంతి పండుగకు పతంగులను ఎగురవేయడం అనేది ఓ ఆనందం.. అదో సందడి. రంగురంగుల పతంగులను ప్రతి ఒక్కరూ తమ ఇంటి మేడల పైకి, డాబాలు, ఖాళీ ప్రదేశాలు, మైదానంలో గాల్లో ఎగరవేస్తుంటే.. రెక్కలు విప్పిన విమానంలా నింగలో దూసుకెళ్తూ.. కొద్ది నిమిషాల్లోనే కనుచూపు మేర ఎవరికీ అందనంత ఎత్తుకు దూసుకెళ్తుంటే.. అందులోనూ అందరి కంటే మన పతంగి ఎక్కువ ఎత్తుకు వెళ్తే వచ్చే కిక్కే వేరు. అయితే, పతంగి ఎగరేసే సమయంలో కోరి ప్రమాదాలు తెచ్చుకుంటున్నారు.. కొంత మంది. ఈ సంక్రాంతి పండుగకు పతంగులు ఎగురవేసే ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకుంటే వారితో పాటు ఇతరులకు ప్రయోజకరంగా ఉంటుంది. పతంగులు ఎగురవేసేటప్పుడు తగు జాగ్రత్తల తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులు, పోలీసులు సూచిస్తున్నారు.

### పతంగులతో జరపైలం..

సంక్రాంతి పండుగ సందర్భంగా సెలవులు రావడంతో పిల్లలు, యువకులు సంతోషంగా పతంగులను ఎగరవేస్తుంటారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు వారి వెంట ఉండి తగు జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. లేదంటే పండుగ పూట ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదం ఉంది. ముఖ్యంగా చిన్నారులు, యువకులు పతంగులు ఎగరవేసేటప్పుడు బంగ్లాలు, డాబాలు, మేడలపైన ఎగరవేయకుండా చూడాలి. వాటి చుట్టూ గోడలు లేని ఇండ్లపై ఎగురవేయకుండా జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. తప్పనిసరైతే తల్లిదండ్రులు, పెద్దలు సమక్షంలో గోడలు ఉన్న వాటిపై ఎగురవేయాలి. ఇక రద్దీగా ఉండే రోడ్ల మీద, గల్లీల్లో పతంగుల ఎగరేయకుండా చూసుకోవాలి. రోడ్ల మీద వెళ్తే వాహనాలతో ప్రమాదాలకు గురికావాల్సి ఉంటుంది. ధారం తెగి కరెంట్ తీగలకు కానీ, చెట్ల కొమ్మలకు చుట్టుకున్నప్పుడు వాటిని తీసే సాహసం చేయరాదు. గల్లీలో పతంగులు ఎగరవేసేటప్పుడు అక్కడ ఉండే కరెంట్ తీగలకు పతంగులు తాకి చిక్కుకున్నప్పుడు వాటిని తీసుకోవడానికి ఇనుప రాడ్లు, లేదా ఇతర వస్తువులతో కరెంట్ తీగలను కదిలించే ప్రయత్నం చేయడం మంచిది కాదు. కరెంట్ షాక్ తగిలే అవకాశం ఉంటుంది. కరెంట్ తీగలు లేని ఖాళీ ప్రదేశాలు, మైదానాల్లో పతంగులు ఎగురవేస్తే అన్నివిధాలా మంచిది. అత్యంత ప్రమాదకరమైన చైనా మాంజాలను ఉపయోగించి పతంగులను ఎగురవేయరాదు. ముఖ్యంగా పక్షులు తిరిగే ప్రాంతంలో పతంగులు అస్సలు ఎగురేయడం మంచిది కాదు. పక్షుల రెక్కలకు, కాళ్లకు మాంజా చిక్కుకుని అవి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. చెరువులు, నదులు, కుంటలు, పాడుబడిన బావులు, నాలాల దగ్గర పతంగులను ఎరగవేయకుండా జాగ్రత్తలు చూసుకోవాలి. పైకి చూసుకుంటూ పతంగులు ఎగురవేస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయి. ఎలాంటి ప్రమాదం జరగకుండా ఉండాలంటే ప్లే గ్రౌండ్‌లో, స్టేడియాల్లో, ఖాళీ ప్రదేశాల్లో ఎగరవేయడం మంచింది. ముఖ్యంగా రైల్వే స్టేషన్లు, రైల్వే ట్రాక్‌ల దగ్గర అసలు పతంగులను ఎగిరేయవద్దు.

### బహిరంగ ప్రదేశాల్లో ఎగరవేయాలి..

విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్న చోట పతంగులు ఎగురవేయకపోవడం మంచిది. వైర్లకు పతంగులు తగిలి చుట్టుకోవడంతో ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉంటాయి. కాటన్, నైలాన్‌తో చేసిన మాంజాలను మాత్రమే వాడాలి. మెటాలిక్ మాంజాలతో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పతంగులు, మాంజాలు విద్యుత్ తీగలు, పరికరాలపై పడినప్పుడు వాటిని వదిలివేయాలి. తీగలపై పడిన పతంగులను లాగడం మంచిది కాదు. ముఖ్యంగా తెగిన తీగలను అసలే తాకొద్దు. విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు లేని బహిరంగ, ప్రదేశాలు, మైదానాల్లో పతంగులను ఎగురవేయడం మంచిది. ఏమైనా సమస్యలుంటే వెంటనే విద్యుత్ అధికారులు, సిబ్బందికి సమాచారం అందించాలి.

-మహేశ్, ట్రాన్స్‌కో సబ్ ఇంజినీర్, జహీరాబాద్

### జాగ్రత్తలు పాటించాలి..

పిల్లలు, యువకులు పతంగులు ఎగురవేసేటప్పుడు తల్లిదండ్రులు గమనిస్తుండాలి. మేడలు, డాబాలు, బంగ్లాలపై, వాటికి చుట్టూ పైన ప్రహరీ లేని చోట్ల పతంగులు ఎగురవేయకుండా చూడాలి. రద్దీ ప్రదేశాల్లో పతంగులు ఎగురవేస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కావడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయి. ధారం తెగినప్పుడు పతంగులను పట్టుకునేందుకు వెళ్లే సమయంలోనూ, చెరువులు, నదులు, కుంటలు, పాడుబడిన బావులు, నాలాల దగ్గర పైకి చూసుకుంటూ పతంగులు ఎగురవేస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయి. చైనా మాంజాతో మనుషులు, పక్షులు, జంతువులకు ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో ఎట్టి పరిస్థితులో వినియోగించువద్దు.

-కాశీనాథ్, జహీరాబాద్ పట్టణ ఎస్సై

# ముత్తంగిలో బాలుడి అదృశ్యం

సాయి వరుణ్

పటాన్‌చెరు, జనవరి 13 : ముత్తంగిలో బాలుడు అదృశ్యమయ్యాడు. పటాన్‌చెరు సీఐ వినాయక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామంలో విజేత కాలనీలో నివసించే నర్సయ్య కుమారుడు సాయి వరుణ్ (15) సోమవారం ఉదయం ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అన్ని చోట్ల వెతికారు. బంధువులు, స్నేహితుల వద్ద ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతడి ఆచుకీ తెలిస్తే ఫోన్ నెంబర్లలో 8712656724, 8712 6 56756కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

# వ్యవసాయ భూముల సమగ్రసర్వే

హత్నూర, జనవరి13 : సాగుకు ఆమోద యోగ్యమైన వ్యవసాయ భూములపై సమగ్రసర్వే నిర్వహిస్తున్నట్లు హత్నూర తహసీల్దార్ ఫర్వీన్‌షేక్ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో రైతుభరోసా అమలుచేయనుండటంతో ప్రభుత్వ ఆదేశాలమేరకు వ్యవసాయానికి పనికి వచ్చే భూముల సర్వే ప్రక్రియను ముమ్మరంగా చేపడుతున్నట్లు తెలిపారు. వెంచర్లు, ప్లాట్లు, సాగుచేయని బీడు భూములు గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. సాగుకు ఆమోదయోగ్యమైన వ్యవసాయ భూములకు మాత్రమే రైతుభరోసా ఇవ్వనున్నట్లు తెలిపారు.

# వైన్స్‌షాప్‌లో చోరీ..

రామచంద్రాపురం, జనవరి 13 : వైన్స్ దుకాణంలో చోరీ జరిగిన సంఘటన కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లాపూర్‌లోని ఎంఎం వైన్స్‌లో ఆదివారం అర్ధరాత్రి వైన్స్ ముందు సెక్యూరిటీ నిద్రిస్తున్న క్రమంలో ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు వైన్స్ వెనుకాల నుంచి ఐరన్ షీట్‌ని వంచి వైన్స్‌లోకి ప్రవేశించి రూ.55 వేలు నగదు, రూ.5 వేలు విలువ చేసే మద్యం బాటిళ్లు చోరీ చేశారు. ఈ విషయం తెలుసుకున్న మేనేజర్ మహేశ్‌గౌడ్ పోలీసులకు సమాచారం అందించడంతో సోమవారం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# హెచ్చరిక ఫ్లెక్సీల ఏర్పాటు

ములుగు, జనవరి 13 : కొండపోచమ్మ జలాశయంలో ఐదుగురు యువకులు ప్రమాదవశాత్తు నీట మునిగి మృత్యువాతపడిన ఘటన నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. మర్కుక్‌లోని కొండపోచమ్మ జలాశయం వద్ద ములుగు ఎస్సై విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

### చెరువు, కుంటల వద్దకు వెళ్లొద్దు

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి13: సంక్రాంతి పండుగ కోసం పట్టణాల నుంచి గ్రామాలకు వచ్చిన పిల్లలు చెరువు, కుంటల వద్దకు వెళ్ల కూడదని మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ సూచించారు. సోమవారం మద్దూరు మండలంలోని గాగిళ్లాపూర్ పెద్ద చెరువును ఆయన సందర్శించి, చెరువు ప్రమాదాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డికి బహుమతి

రాయపోల్, జనవరి 13 : మధ్యప్రదేశ్ లోని బుర్హాపూర్‌లోని మ్యాక్రో విజన్ అకాడమీలో రామన్ సైన్స్, టెక్నాలజీ ఫౌండేషన్ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ టీచర్ సైంటిస్ట్ ఇండియా, ఏపీజేకేవైఎస్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన 5వ భారతీయ సైన్స్ టెక్నో ఫెస్టివల్ 2025లో ఇన్నోవేటివ్ టీచింగ్ మెథడ్ ప్రదర్శనలో సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం బేగంపేట పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ సైన్స్) ఉపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి మూడో బహుమతి సాధించాడు.ఈ మెగా సైన్స్ ఈవెంట్‌లో దేశంలోని 18 రాష్ట్రాల నుంచి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.వివిధ కేటగిరీల్లో ఉపాధ్యాయులు చూపిన ప్రతిభలో భాస్కర్‌రెడ్డికి ముడోబహుమతి రావడంపై జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.

### గ్యాంబ్లింగ్ తంబోలా స్థావరంపై దాడి

గజ్వేల్, జనవరి 13: మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ గ్రామ శివారులో కొంత మంది గ్యాంబ్లింగ్ తంబోలా ఆడుతున్నారనే సమచారంతో టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించి నలుగురిని ఆదుపులోకి తీసుకున్నారు. ప్రజ్ఞాపూర్‌కు చెందిన యెల రమేశ్, మహమ్మద్ గౌస్‌పాషా, ఎన్.చందు, మండ నరేశ్ గ్యాంబ్లింగ్ తంబోలా ఆడుతుండగా వారి వద్ద నుంచి రూ.12,980 నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# పలువురికి మాజీ మంత్రి పరామర్శ

శంకర్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

చిన్నకోడూరు, జనవరి 13 : మండలంలోని సలెంద్రి గ్రామ మాజీ సర్పంచ్ శంకర్ అనారోగ్యంగా ఉన్న విషయం తెలుసుకుని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని ధైర్యంగా ఉండాలని చెప్పారు. మైలారం గ్రామానికి చెందిన జిల్లా కో-ఆపరేటీవ్ సభ్యుడు, మాజీ జడ్పీటీసీ, పార్టీ సీనియర్ నాయకుడు నముండ్ల రామచంద్రం అనారోగ్యంతో ఇటీవల కరీంనగర్ దవాఖానలో చికిత్స పొందగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జంగిటి శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఉమేశ్‌చంద్ర ఉన్నారు.

రామచంద్రంను పరామర్శిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

# ఓపెన్ టు ఆల్ క్రీడలు అదుర్స్

కబడ్డీలో మొదటి బహుమతి కిచ్చన్న గారి శ్రీనివాస్ రెడ్డి టీమ్‌కు అందజేస్తున్న ముఖ్య అతిథులు

గుమ్మడిదల, జనవరి 13 : ప్రపంచ దేశాలకు భారత దేశ గొప్పతనాన్ని చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పల ప్రసాద్ అన్నారు. ఓపెన్ టు ఆల్ క్రీడోత్సవాల బహుమతి ప్రదానోత్సవంలో ఆయన హాజరై మాట్లాడారు. మన భారత దేశ గొప్ప సాంస్కృతి సంప్రదాయాలను పదిలంగా ముందు తరాలకు అందజేయాలన్నారు.

### మూడు రోజుల పాటు ఉత్కంఠంగా క్రీడా పోటీలు

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సీజీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని గుమ్మడిదల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఓపెన్ టు ఆల్ వాలీబాల్ కబడ్డీ పోటీలు చివరి నిమిషం వరకు నువ్వా నేనా అన్నట్లుగా హోరా హోరీగా సాగాయి. కబడ్డీ పోటీలో మొదటి విజేతగా పిచ్చన్న గారి శ్రీనివాస్ రెడ్డి యూనియన్ బ్యాంక్ టీమ్ నిలిచింది. వాలీబాల్ పోటీల్లో మొదటి విజేతగా పటాన్‌చెరు పటోళ్ల ఆదిత్య రెడ్డి టీమ్ నిలిచింది. గెలుపొందిన మొదటి విజేతకు రూ .50వేలు , రెండో విజేతకు రూ .30 వేలు టోఫీలు ప్రశంసాపత్రాలను అందజేశారు. సీజీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలకు సహకరించినందుకు ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ప్రత్యేక అభినందనలను తెలియజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ వైస్ చైర్మన్ చిమ్ముల నరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ చిమ్ముల లలితానరసింహారెడ్డి, ట్రస్ట్ ముఖ్య సభ్యులు చిమ్ముల దేవేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్, దేవాలయ కమిటీ అధ్యక్షుడు పడమటి లక్ష్మిరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు పొచ్చగారి మోహన్ రెడ్డి, వర్తక సంఘం అధ్యక్షుడు ఆకుల సత్యనారాయణ, జిన్నారం వెంకటేశ్ గౌడ్ నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి మద్దుల బాల్రెడ్డి, నాయకులు ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# దర్గాలో చాదర్ సమర్పణ

పటాన్‌చెరు పట్టణంలోని హజ్రత్ సయ్యద్ నిజాముద్దీన్‌షా దర్గా ఉర్సు ఘనంగా జరుగుతున్నది. సోమవారం పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ దర్గాను సందర్శించి చాదర్ సమర్పించారు.

-పటాన్‌చెరు, జనవరి 13

# అపూర్వ సమ్మేళనం

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

వర్గల్, జనవరి13: వర్గల్ మండలం మజీద్‌పల్లి జిల్లాపరిషత్ ప్రభుత్వ పాఠశాల 1991 బ్యాచ్‌కు చెందిన టెన్త్ విద్యార్థులు సోమవారం సమ్మేళనం జరుపుకొన్నారు. నెంటూర్‌లోని ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో అప్పటి ఉపాధ్యాయులు విశ్వనాథం, కృష్ణారెడ్డి, బాల్‌రాజ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నాచారం మాజీ సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ ఉపాధ్యక్షుడు మలిపెద్ది శ్రీనివాస్‌రెడ్డి, గడివెనుక కుమార్‌గౌడ్, పార్వతీబాలాగౌడ్, వనజ, కృష్ణవేణి పాల్గొన్నారు.

# లారీని తప్పించబోయి రోడ్డు దిగిన ఆర్టీసీ బస్సు

- డ్రైవర్ చాకచక్యంతో తప్పిన ప్రమాదం
- బస్సులో 70 మంది ప్రయాణికులు

రోడ్డు పక్కకు ఒరిగిన ఆర్టీసీ బస్సు

కోహెడ, జనవరి 13: మండలంలోని సిద్దిపేట -హనుమకొండ రహదారి బస్వాపూర్ బ్రిడ్జి వద్ద సోమవారం పెను ప్రమాదం తప్పింది. వరంగల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సిద్దిపేట నుంచి వరంగల్ వెళ్తున్నది. బస్వాపూర్ బ్రిడ్జి సమీపంలోకి చేరుకోగానే లారీ ఎదురుగా రావడంతో ఆర్టీసీ బస్సు డ్రైవర్ దాన్ని తప్పించబోయాడు. దీంతో ఒక్కసారిగా బస్సు రోడ్డు కిందికి దిగి పోయింది. డ్రైవర్ చాకచక్యంతో బ్రేకులు వేయడంతో ప్రాణాపాయం తప్పింది. బస్సులో సుమారు 70 మంది ప్రయాణికులు ఉన్నారు. రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండడంతో ఈ ప్రమాదానికి కారణమైంది.

# గూడెంలో కాట్రెవుల పండుగ

కాట్రెవులలో భాగంగా ఏర్పాటు చేసిన రైతు, ఎద్దులు, వ్యవసాయ పని ముట్ల ప్రతిమలు

బెజ్జంకి, జనవరి 13 : మండలంలోని పలు గ్రామాల్లో కాట్రెవులను రైతులు ఘనంగా నిర్వహించుకున్నారు. గూడెంలో రైతు, ఎద్దులు, వ్యవసాయ పని ముట్లను మట్టితో తయారు చేసి, వాటికి ప్రత్యేక పూజలు చేసి, పశువులను రంగులతో అలంకరించి, మొక్కులు చెల్లించుకున్నారు. రైతు కూలీ సంఘం నాయకుడు భామండ్ల రవీందర్, రైతులు బాబురావు, రాజిరెడ్డి, సదయ్య, బాలమల్లు, మల్లేశం, కనుకయ్య , రవి, మల్లయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం

గజ్వేల్, జనవరి 13: మండల పరిధిలోని బంగ్లావెంకటాపూర్ గ్రామానికి చెందిన దర్శనం నాగమణి కొద్ది రోజుల క్రితం మృతి చెందింది. ఆమె ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. మృతురాలి కుటుంబ సభ్యులకు సోమవారం వర్గల్ మండలం గౌరారం గ్రామానికి చెందిన రేణుక భజన మండలి సభ్యులు నిత్యావసర సరుకులు, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బియ్యం అందజేశారు.

జిన్నారం (బొల్లారం) : పతంగులతో చిన్నారులు

# సంక్రాంతి సంబురాలు

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం సంగారెడ్డిలో మహిళలు రంగులతో భోగి, సంక్రాంతి ముగ్గులు వేశారు. యువత, చిన్నారులు పతంగులను ఎగరవేశారు. జిల్లాలో కొత్త అల్లుళ్లు, పిండివంటలతో కుటుంబ సమేతంగా వచ్చిన వారితో గ్రామాల్లో సంక్రాంతి శోభ సంతరించుకున్నది.

*-సంగారెడ్డి జిల్లా ఫొటోగ్రాఫర్, నమస్తే తెలంగాణ, జనవరి13*

రామచంద్రాపురం : తెల్లాపూర్ గేటెడ్ కమ్యూనిటీలో భోగి మంటలు వేసిన కాలనీవాసులు

జహీరాబాద్ : డీడీఎస్ ప్రధాన కార్యాలయంలో భోగి మంటలతో మహిళా సంఘాల సభ్యులు

సంగారెడ్డి శాంతినగర్‌లో సంక్రాంతి సందర్భంగా కొత్త అల్లుళ్లకు 108 రకాలతో ఏర్పాటు చేసిన విందు